పతంగుల సందడి

సంక్రాంతి అంటే అందరి కళ్లలో కాంతి నింపే పెద్ద పండగ. కొత్త అల్లుళ్లు, కొంటె మరదళ్లు, డూడూ బసవన్నలు, ఇళ్ల ముందు రంగు రంగుల రంగవల్లులు, పిండి వంటలతో ప్రతి ఇంటా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతాయి. వీటన్నింటితో పాటు కోడి పందాలు, ఎడ్ల పందాలతో పాటు చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ఆడుకునే పతంగులు ఈ వేడుకకు కొత్త శోభనిస్తాయి.



అల్లిపురంలోని గాలిపటాల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

- సంక్రాంతి వేళ.. జోరందుకున్న గాలిపటాల అమ్మకాలు
- ఆకట్టుకుంటున్న వివిధ వెరైటీలు

అల్లిపురం : సంక్రాంతి రాకతో ఎక్కడ చూసినా గాలిపటాల సందడి మొదలైంది. నగరంలో గాలిపటాల విక్రయాలంటే తొలుత గుర్తుకు వచ్చేది అల్లిపురం. గాలిపటాలు కొనేందుకు దుకాణాల వద్ద పిల్లలు సందడి చేస్తున్నారు. రక రకాల సెలబ్రిటీల ఫొటోలతో పాటు పక్షులు, జంతువుల గాలి పటాలకు గిరాకీ పెరిగింది. మార్కెట్‌లో రూ.5 నుండి రూ.5,000 వరకు గాలిపటాల అమ్మకాలు జరుపుతున్నారు.

మాంజాలదే ముఖ్య భూమిక..

గాలిపటాలు ఎగురవేయడంలో మాంజాలదే ముఖ్యభూమిక. ఈ మాంజాలలో 50 రకాల వరకు ఉన్నాయి. కానీ అందుబాటులో కొన్ని రకాలు మాత్రమే ఉన్నాయి. మోతీలాల్, టాంగూస్, బరెల్లి, టైగర్ స్పెషల్, డబుల్ బ్లేడ్, మెట్రో వంటి మాంజాలు ఉన్నాయి. ఈ మాంజాలను సోడా సీసపు పొడి, కలబంద, బెండకాయ రసం, మైదాపిండితో రకరకాల రంగులు కలిపి ప్రత్యేకంగా తయారు చేస్తారు. అదే విధంగా పిల్లలు మాంజాలను ప్రత్యేకంగా తయారు చేసుకుంటుంటారు. వీటితో గాలిపటాల పోటీలు పెట్టుకుంటుంటారు.

చరక..

గాలి పటాలు ఎగురవేసేందుకు చరక తప్పనిసరి. గాలిపటం పైకి వెళ్లిన తర్వాత దారం త్వరగా వదిలేందుకు, చుట్టేందుకు ఈ చరక ఉపయోగపడుతుంది. చరకను వెదురు కర్రతో తయారు చేస్తారు. మార్కెట్‌లో ప్లాస్టిక్, స్టీల్‌వి దొరుకుతున్నాయి. వీటి ధర రూ.20 నుండి రూ.500 వరకు ఉంది.

పలు ఆకృతుల గాలిపటాలు..

ఆంగ్రీబర్డ్, స్పైడర్‌మాన్, బటర్ ఫ్లై, అవెంజర్, క్లాత్ స్పెషల్ పతంగి, పొలిటికల్ లీడర్, సినిమా హీరో.. హీరోయిన్లు, కార్టూన్స్ వంటి 25 రకాల ఫ్యాన్సీ గాలిపటాలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ప్లాస్టిక్, పేపర్, క్లాత్‌తో తయారయ్యే గాలిపటాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా వీటి ధరలు ఉన్నాయి.



పిల్లల్ని ఆకర్షించే కార్టూన్ పతంగులు



చిన్నారులకు నచ్చే పక్షి ఆకారం గాలిపటాలు



ఇట్టే ఆకర్షించే గ్రద్ద ఆకారంలోని గాలిపటం

గాలిపటాలకు పెట్టింది పేరు అల్లిపురం..

గాలిపటాల వ్యాపారానికి పెట్టింది పేరు నగరంలోని అల్లిపురం. ఇక్కడ గాంధీ బొమ్మ పక్క నుండి వెళ్తే కుమ్మరవీధి రోడ్డులో గాలిపటాల విక్రయాల షాపులు దర్శనమిస్తాయి. వీధిలో గాలిపటాలను అందంగా అలంకరించి ఉంచుతారు. పిల్లలతో సందడిగా ఈ వీధి నిత్యం కళకళలాడుతుంటుంది. ఇక్కడ రిటైల్, హోల్‌సేల్‌గా అమ్మకాలు జరుపుతారు. నగరంలో పెద్ద పెద్ద దుకాణాలకు ఇక్కడి నుండే సరఫరా చేస్తుండటం విశేషం. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల వారు కూడా ఇక్కడి నుండే కొని పట్టుకెళ్తుంటారు.



రకరకాల గాలిపటాలు

జాగ్రత్తలు తప్పనిసరి..

పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా పరిశీలించాలి. ఆనందాన్ని నింపే పతంగులు ఎగురవేసే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు తప్పవు. భవనంపైకి ఎక్కి పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తుంటారు. ఆకాశంలో అందంగా ఎగురుతున్న గాలిపటం పైనే దష్టి పెట్టి డాబాలపై తిరుగుతుంటారు. భవనంపై ప్రహరీ లేకపోయినా, చిన్నగా ఉన్న ఎటువంటి భవనాల పైకి పిల్లలను పంపకూడదు. అదే విధంగా విద్యుత్ తీగలకు చిక్కుకునే గాలిపటాలను పిల్లలు తీసే ప్రయత్నం చేస్తే వారిని ఆపండి. లేకపోతే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో గాలిపటాలు ఎగురవేసుకోమని చెప్పాలి. తప్పనిసరి అయితే తల్లిదండ్రులు దగ్గర ఉండి గాలిపటాలను పిల్లలతో ఎగురవేయించటం ఉత్తమం.

పెరుగుతున్న ఆదరణ



సంక్రాంతి వచ్చిందంటే అన్ని వయస్సుల వారు గాలిపటాలు ఎగురవేస్తారు. విభిన్న ఆకృతులలో గాలిపటాలు లభ్యమవుతున్నాయి. వాటిని కొనుగోలు చేయటంలో ఆసక్తి చూపుతున్నారు. కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, జంషెడ్‌పూర్, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుండి గాలిపటాలను దిగుమతి చేసుకుంటున్నాం. సంక్రాంతి రోజులతో పాటు ఏడాది పొడవునా గాలిపటాల అమ్మకాలు జరుపుతుంటాం.

– బొట్టా రమేష్, గాలిపటాల వ్యాపారి, అల్లిపురం

మూడు దశాబ్దాలుగా ఇదే వ్యాపారం



గతంలో విశాఖపట్నంలో అల్లిపురంలో మాత్రమే గాలిపటాలు దొరికేవి. మేము ఈ ప్రాంతంలో గత మూడు దశాబ్దాలుగా అమ్మకాలు జరుపుతున్నాం. విశాఖలో గాలిపటాల సందడి పెరిగింది. దీంతో సంక్రాంతి సమయంలో గాలిపటాలకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం చాలా షాపులు ప్రారంభమయ్యాయి. దీంతో మాకు డిమాండ్ తగ్గింది.

– బొట్టా భవానీ శంకర్, గాలిపటాల వ్యాపారి, అల్లిపురం

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కమిషనర్ సాయికాంత్ వర్మ దంపతులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.

సినీ సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్ : మెలోడి క్రియేటర్స్, శృతిలయ, రస రాగమాధురి, కళాంజలి సరిగమ సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19న 'గుర్తుకొస్తున్నాయి' పేరిట నిర్వహించనున్న సినీ సంగీత విభావరి పోస్టర్‌ను శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న సినీ సంగీత విభావరిని కళారంగ ప్రముఖులు, విజయవంతం చేయాలని కోరారు. సీహెచ్‌వీ సత్యనారాయణ, రాజశేఖర్, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోకు సత్కారం



ఈవో శిరీషను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆలయ ఈవో కె. శిరీషను శనివారం ఘనంగా సత్కరించారు. భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు చక్కటి ఏర్పాట్లు చేశారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారని సంఘం అధ్యక్షుడు ఎస్. కస్తూరి ఈ సందర్భంగా తెలిపారు. అందరి సహకారంతోనే ఉత్సవాలు విజయవంతమయ్యాయని ఈవో శిరీష పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి లక్ష్మి, సభ్యులు కనకమహాలక్ష్మి, వెంకటరత్నం, తులసీరత్నం, శ్రీను, గోవిందు, సంజీవితో పాటు ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30వ వార్డులో సంక్రాంతి సందడి



30వ వార్డు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డు తాడివీధి వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్లో కార్పొరేటర్ కొడూరు అప్పల రత్నం ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ముగ్గులు, సంక్రాంతి పిండి వంటలు, గొబ్బెమ్మలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ వడ్డాది దిలీప్‌కుమార్, 30వ వార్డు పార్టీ ఉపాధ్యక్షుడు దశమంతుల చిన్ని, పార్టీ నాయకులు మీనా, రాము, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన గురు పూజోత్సవాలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బి.ఆర్.కె రాజు, కె.ఎస్.ఆర్ గోపాల్, బి.ఎస్.ఎన్.రాజు

మహారాణిపేట: ఆధునిక యుగంలో రకరకాల సమస్యలతో సతమతమవుతున్న మానవాళికి పరిష్కార మార్గమొక్కటే శరణ్యమని.. అలాంటి మార్గం పరమ గురువుల బోధనల్లో లభిస్తుందని ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.ఎస్.ఎన్. రాజు (కోల్‌కతా) అన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఫంక్షన్ హాలులో శనివారం జగద్గురు పీఠం నిర్వహించిన 63వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలతో తాను ప్రభావితం చెందానన్నారు. అనంతరం పార్వతీకుమార్ రాసిన మెర్రీ లైఫ్ డే అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు 'శంబళ' అనే మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంస్థ సలహామండలి సభ్యుడు కె.ఎస్.ఆర్.గోపాల్ (హైదరాబాద్) 'విష్ణు సహస్రనామ' ప్రసంగాల రెండవ సంపుటిని విడుదల చేశారు. సభకు అధ్యక్షత వహించిన ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్ మాట్లాడుతూ విదేశాల్లో మత సంస్థ చేపడుతున్న జ్ఞానయజ్ఞం, రామనామ యజ్ఞ కార్యక్రమాలను వివరించారు. గురు పూజలో భాగంగా పప్పు రవిశంకర్ రుద్రాభిషేకం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కె.రవి, ఖరగ్‌పూర్‌కు చెందిన జి.వి.కృష్ణమోహన్ తమ అనుభవాలను వివరించారు. 'నావాణి' 'దర్శన మాసపత్రికపై సమీక్ష జరిపారు. జగద్గురు పీఠం వివిధ కేంద్రాల నుంచి రెండు వేలమందికి పైగా సాధకులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాస్టర్ ఇ.కె. నీరాజనంతో 63వ గురుపూజోత్సవాలు ఘనంగా ముగిశాయి. సంస్థ డైరెక్టర్ అజ్జరపు శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించగా, జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పాల్గొన్నారు.

సంక్రాంతి కళకళలు

వండగ రద్దీతో కిక్కిరిసిపోయిన పలు ప్రాంతాలు



పోలీస్ బ్యారెక్స్ వద్ద దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



పూర్ణామార్కెట్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్



పందుపుల్లల సందు వద్ద..



యల్లమ్మతోటలో భోగి మంటలతో పండగ వాతావరణం

జగదాంబ : భోగి, సంక్రాంతి, కనుమ పండగల నేపథ్యంలో ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత జనంతో అన్ని ప్రాంతాలు నిండిపోయాయి. ముఖ్యంగా జగదాంబ నుంచి వన్‌టౌన్, పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాలు వాహనాలు, జనంతో కిక్కిరిసిపోయాయి. కొత్త బట్టల కొనుగోలుకు జగదాంబ జంక్షన్, పందుపుల్లల సందు, టర్నర్‌చౌల్ట్రీ, పోలీస్ బ్యారెక్స్ వద్ద, నిత్యావసరాలు, పిండివంటలకు సంబంధించి పూర్ణామార్కెట్, స్ప్రింగ్‌రోడ్డు, నూనెమిల్లువీధి, ఫ్యాన్సీ వస్తువులకు ప్రసాద్‌గార్డెన్స్ ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీల్లేనంత రద్దీ ఉంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.

యల్లమ్మ తోటలో పండగ వాతావరణం..

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డులో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో శనివారం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. గంగిరెద్దుల వేషాలు..



పూర్ణామార్కెట్ వద్ద జన సందోహం



డూడూ బసవన్నలు.. గంగిరెద్దుల ఆటలు

భోగి మంటల సందళ్లు.. పిల్లలు..పెద్దలకు మ్యూజికల్ చైర్, లెమన్‌స్పూన్ రన్నింగ్ పోటీలతో యల్లమ్మతోటలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పెంటకోట రాజు, గారి రాంబాబు, రాము మాస్టారు, పెంటకోట బాబూరావు, కొండా భవాని, కర్రి ధనలక్ష్మి, మిమిక్రీ రాజు, పిలక మోహన్, మాదాబత్తుల లక్ష్మణరావు, కృష్ణారెడ్డి, పార్వతి, రమణ, శ్రావణి, జితూ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులున్న వాహనాలే కొనండి



మాట్లాడుతున్న ఈస్ట్ క్రైం ఏసీపీ వెంకటరావు

అల్లిపురం : రికార్డులు లేని వాహనాలు కొనరాదని, అన్ని సక్రమంగా ఉండే వాహనాలు మాత్రమే కొనుగోలు చేయాలని లేని ఎడల శిక్షార్హులవుతారని ఈస్ట్ క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఈస్ట్ క్రైం సీఐ వి.చక్రధరరావుతో కలిసి శనివారం సాయంత్రం గాజులవీధిలో ద్విచక్ర వాహనాలు, స్క్రాప్ దుకాణ యజమానులు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దొంగతనాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగ వాహనాలు అమ్మకానికి తీసుకువచ్చిన వారి వివరాలు పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్క్రాప్ దుకాణ యజమానులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ నియామకం

అల్లిపురం : వెంకటేశ్వరమెట్ట దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన గోదా రంగనాథుల కల్యాణం, 17వ తేదీన పరుస మహోత్సవాల సందర్భంగా దేవదాయ శాఖ బుద్ధ గోపాలకృష్ణ, కె.శివ సంతోష్‌కుమార్, తాడి అనురాధ, వలిశెట్టి లక్ష్మి, ఒమ్మి హరి, బొడ్డేటి కిషోర్, కొల్లి సత్యవతి, పాత్రేటి శివకుమార్, పీలా రవి చంద్రశేఖర్‌లతో ఉత్సవ కమిటీ నియమించినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ కమిటీ ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే కొనసాగుతుందన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



35వ వార్డు కల్లుపాకలకు చెందిన వంకాల సీతమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



కొబ్బరితోటకు చెందిన వంశీకృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో ఆర్థిక సాయం కోసం విజ్ఞప్తి చేసిన పలువురి ఇళ్లకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. 12 నిరుపేద కుటుంబాలకు రూ.57,500 ఆర్థిక సాయం అందజేశారు. 33వ వార్డు అల్లిపురం గోవిందరోడ్డుకు చెందిన అలజంగి నరసింగరావుకు వైద్య ఖర్చుల కోసం రూ.5 వేలు, 34వ వార్డు కొబ్బరితోటకు చెందిన వాదిసెల నూకరాజుకు మందుల ఖర్చులకు, అదే ప్రాంతానికి చెందిన పొన్నాడ వంశీకృష్ణ ఇటీవల మరణించడంతో పెద్దకర్మ కోసం రూ.5 వేలు అందజేశారు. 35వ వార్డు బొడారారోడ్డు కల్లుపాకలకు చెందిన వంకాల సీతమ్మకు రూ.5 వేలు, 30వ వార్డు తాడివీధికి చెందిన బాలశేఖర్‌కు, అదే వార్డు కొత్త సాలిపేటకు చెందిన నంబారి అప్పారావుకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. 38వ వార్డు కంచరవీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాడుగు చిన్నతల్లి పెద్ద కర్మ కోసం, 39వ వార్డు థాంసన్ స్ట్రీట్‌కు చెందిన కొండా చంద్రశేఖర్, చిలకపేటకు చెందిన పోలిపిల్లి సంజీవ్‌కు, వార్డు పరిధి పద్మానగర్‌కు చెందిన శృంగవరపు నాగమణికి, 37వ వార్డు కొత్తజాలారిపేటకు చెందిన వాసుపల్లి ఎల్లాజీకి పెన్షన్ రాని కారణంగా రూ.1000, మరో ముగ్గురు అవ్వలకు రూ.500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

షాపింగ్‌మాల్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, రద్దీ ప్రాంతాల్లో పోలీసుల విస్తృత ప్రచారం



ఈస్ట్ క్రైం సీఐ చక్రధరరావు

అల్లిపురం : సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఇల్లు వదిలి వెళ్లే సమయంలో ఇంటి చిరునామా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలని, ఎప్పుడు ఊరు వెళ్తున్నది, ఎప్పుడు తిరిగి వస్తున్నది అందజేయాలన్నారు. ఇంటి యజమాని ఫోన్ నంబరు తెలియజేసి, వాచ్‌మెన్‌ను నియమించాలని తెలిపారు. వాచ్‌మెన్ ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. అపార్ట్‌మెంట్ సెల్లార్, ప్రవేశ ద్వారం, కారిడార్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకూడదని, చిన్నపిల్లలు, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకూడదని తెలిపారు. కరెన్సీ నోట్లు కిందపడేసి, మీ దష్టిని మరల్చి విలువైన వస్తువులు, తెచ్చుకున్న డబ్బు కాజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. పోలీసు శాఖ రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్‌ను ప్రజలు తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ అవ్వాలి. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లే ముందు ఈ యాప్ సహాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు మీ ఇంటిదగ్గర టెక్నాలజీ సహాయంతో భద్రత కల్పిస్తారు. అత్యవసరమైనప్పుడు డయల్ 100, 1090కి గాని, టూటౌన్ 0891-2783672, మహారాణిపేట పోలీస్ స్టేషన్లకు 0891-2746866 నంబర్లలో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.



పూర్ణామార్కెట్ షాపింగ్ మాల్ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఘనంగా స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు

జగదాంబ : శ్రీ స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు వన్‌టౌన్ ప్రాంతంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరై వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న పలువురికి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులకు స్ఫూర్తిదాయకమైన స్వామి వివేకానంద రాసిన పుస్తకాలు చదివి వారిని మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. ఆయన పేరుతో స్వామి వివేకానంద స్వతంత్ర సంస్థ స్థాపించి అనేక సేవలందిస్తున్న ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, అంధులు జర్నలిస్టులు, వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన చిన్నారులకు ఎమ్మెల్యే వాసుపల్లి పీఏ సన్యాసిరావు (సన్నీ) జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్, మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్‌కుమార్, స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చందర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, లీడర్ పత్రిక అధినేత వీవీ రమణమూర్తి, హనుమంతరావు, దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి సింహాచలం, ముజీబ్‌ఖాన్, సనపల రవీంద్ర, బాల్జి, తిత్తి కృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్